క్లుప్తంగా

ఏపీటీఎఫ్ 2024 క్యాలెండర్ విడుదల



క్యాలెండర్ ఆవిష్కరణలో ఏపీటీఎఫ్ నేతలు

పోరుమామిళ్ల : స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద శుక్రవారం ఏపీటీఎఫ్(257) యూనియన్ నేతలు 2024 క్యాలెండర్‌ను ఎంఈఓ కాశయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా, మండల అధ్యక్ష, కార్యదర్శులు పోరుమామిళ్ల రీజియన్ ఉపాధ్యాయ నేతలు పాల్గొన్నారు.

ఆర్డీఓకు వినతి

పోరుమామిళ్ల : 18 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు శుక్రవారం పోరుమామిళ్లకు వచ్చిన ఆర్డీఓ ఆకుల వెంకటరమణకు వినతిపత్రం ఇచ్చారు. న్యాయమైన తమ సమస్యల గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ పాల్గొన్నారు.

మృతులకు ఎమ్మెల్యే నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : మండల కేంద్రమైన చాపాడుకు చెందిన ఇద్దరు వైఎస్సార్‌సీపీ వర్గీయులు మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి శుక్రవారం ఉదయం వెళ్లి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ గూడూరు సుబ్బరాయుడు(బాబ్జీ) తండ్రి రామకృష్ణయ్య(92)వయో భారంతో మృతి చెందాడు. అలాగే క్రమంలో కృష్ణయ్య (77) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుల కుటుంబీకులను ఎమ్మెల్యే పరామర్శించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రొద్దుటూరు : మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెంకటరమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ బడ్జెట్, సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి ఉపాధి హామీ పనులకు సోషల్ ఆడిట్

గోపవరం : గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టిన పనులపై 19వ విడత సోషల్ ఆడిట్ శనివారం నుండి ప్రారంభం కానున్నట్లు ఏపీఓ విజయమ్మ తెలిపారు. సుమారు రూ.4 కోట్ల పనులకు సంబంధించి ఈ సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. చేపట్టిన పనులకు సంబంధించి ఎం బుక్కులను సోషల్ ఆడిట్ సిబ్బందికి శనివారం అందజేయనున్నట్లు తెలిపారు. సోమవారం నుంచి ఆయా గ్రామ పంచాయతీలకు సోషల్ ఆడిట్ సిబ్బంది వెళ్ళి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆడిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. చేపట్టిన పనులకు సంబంధించి రైతులు, కూలీలు సోషల్ ఆడిట్ సిబ్బందికి సహకరించి ఏవైనా సందేహాలు ఉంటే వారికి తెలియజేయాలని ఆమె కోరారు.

వైభవోపేతంగా సీతారాముల కల్యాణం

వల్లూరు : స్థానిక తూర్పు వీధిలో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో శుక్రవారం శ్రీ సీతా రాముల కల్యాణ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. ధ్వజ స్తంభ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవంలో భాగంగా శ్రీ సీతా రాముల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. మాంగళ్య ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ముత్యాల తలంబ్రాల కార్యక్రమం జరిగింది.

దంపుడు బియ్యం స్టోర్ ప్రారంభం



ప్రొద్దుటూరు క్రైం : స్థానిక టూ టౌన్ బైపాస్ రోడ్డులో శుక్రవారం ఐశ్వర్య దంపుడు బియ్యం స్టోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ దంపుడు బియ్యం తినడం వల్ల షుగర్, బీపీ, గుండెపోటు లాంటి జబ్బులు దరి చేరవన్నారు. వీటిలో శరీరానికి కావాల్సిన విటమిన్లు, పోషకాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. ఈ బియ్యాన్ని ప్రతి ఒక్కరూ తినొచ్చన్నారు. ఈ బియ్యంతో చేసిన అన్నం మృదువుగా, రుచికరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టోర్ నిర్వాహకులు మండ్ల మల్లికార్జున, ఐశ్వర్య ఫుడ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ బిజినెస్ హెడ్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్, జీఎం లక్ష్మీశ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి పనుల కోసం రోడ్డును తవ్వి పూడ్చాం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రజలకు శుద్ధి జలాలను అందించేందుకు జమ్మలమడుగు రోడ్డును తవ్వి పూడ్చాల్సి వచ్చిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అనిబిసెంట్ స్కూల్ వద్ద నుంచి బొల్లవరం ట్యాంకుల వరకు జరుగుతున్న రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ ప్రలందరికీ తాగునీటిని అందించేందుకు పనులు చేపట్టినట్లు తెలిపారు. 2019 ఎన్నికల సందర్భంగా తాను ఇచ్చిన హామీ నెరవేరిందన్నారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి దాదాపు 50 వేల మెజారిటీతో గెలిపించారని స్పష్టం చేశారు. వాస్తవానికి 2014 ఎన్నికల్లోనే హామీ ఇచ్చానని, తమ పార్టీ అధికారంలో లేకపోవడంతో రూ.150 కోట్లతో అమృత్ నీటి పథకాన్ని ఇప్పుడు పూర్తి చేశామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలిగే పనులు ఎన్నడూ తాను కానీ, తన పార్టీ కార్యకర్తలు కానీ చేయరన్నారు. పాత మార్కెట్ ట్యాంకు పరిధిలోని వారికి మాత్రమే ఇంకా విడుదల చేయాల్సి ఉందన్నారు. గతంలో 10 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉండగా అమృత్ పథకంలో మరో మూడు ట్యాంకులను నిర్మించామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, కమాల్ బాషా, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాయపురెడ్డి, ఆర్ అండ్‌బీ డీఈఈ లక్ష్మీనరసింహులు, మెగా కన్‌స్ట్రక్షన్ కంపెనీ మేనేజర్ మురళి, అధికారులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష నాయకుల్లా విమర్శించొద్దు

ప్రతిపక్ష పార్టీ నాయకుల్లా వ్యక్తిగతంగా ముఖ్యమంత్రి జగన్‌పై విమర్శలు చేయడం తగదని, ఏ ఆపద వచ్చినా ఆదుకునేందుకు తానే ముందు వరుసలో ఉంటున్నానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు చేపడుతున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆప్కాస్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనే డిమాండ్ టీడీపీ హయాం నుంచి ఉందన్నారు. తాము అధికారంలోకి వచ్చాక కరోనా సమయంలో 90 మంది కార్మికులను నియమించామన్నారు. కరోనాలో రూ.25 లక్షలు తన సొంత డబ్బు ఇచ్చానన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కార్మికుల వేతనాలను పెంచిన విషయాన్ని మరిచిపోయారా అని ప్రశ్నించారు. తమ సమస్యల పరిష్కారం కోసం మాత్రమే తాము ఆందోళన చేస్తున్నామని కార్మిక యూనియన్ల నాయకులు సత్యనారాయణ, సాల్మన్, చంటి ఈ సందర్భంగా తెలిపారు.

ఆపరేషన్ కోసం ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్ కోసం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందించారు. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన మల్లిక కొన్నేళ్లుగా బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతుండటంతో రూ.5 లక్షలు అవసరం అవుతుందని వైద్యులు తెలిపారు. సమస్యను తన బంధువుల ద్వారా మల్లిక ఎమ్మెల్యే రాచమల్లును సంప్రదించగా సీఎం సహాయ నిధి ద్వారా రూ.3.50 లక్షలు మంజూరు చేయించారు. ఆపరేషన్ కోసం మరో రూ.1.50 లక్షలు అవసరం అవుతుందని నిరుపేదరాలైన బాధితురాలు తెలపడంతో ఎమ్మెల్యే స్పందించారు. స్థానిక బీసీ వసతి గృహంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి చేతుల మీదుగా ఈ డబ్బును అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు అలవాటు చేసుకోరాదు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ, ప్రిన్సిపాల్

ప్రొద్దుటూరు కల్చరల్ : మత్తు పదార్థాలను అలవాటు చేసుకుని జీవితాన్ని పాడు చేసుకోరాదని త్రీటౌన్ సీఐ కె.వెంకటరమణ పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజ్ యోగివేమన యూనివర్సిటీ కళాశాలలో శుక్రవారం ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా రూపొందించిన ఉద్యమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుపదార్థాలను అలవాటు చేసుకుని యువత పెడదోవ పడుతోందన్నారు. దీనివల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, వీటికి దూరంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.నాగరాజు మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలిచి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో నిలచి సమాజ సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ రమణయ్య, జమాతే ఇస్లామి హింద్ జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ మోహిద్దీన్, ఐడియల్ యూత్ మూవ్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ జబివుల్లా, పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ మోహిత్, సభ్యులు పాల్గొన్నారు.

లింగ వివక్ష చూపడం నేరం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డాక్టర్ మౌనిక

ప్రొద్దుటూరు క్రైం : లింగ వివక్షత చూపడం నేరమని యూపీహెచ్‌సీ డాక్టర్ మౌనిక తెలిపారు. రామేశ్వరంలోని ఎస్‌పీసీఎం హైస్కూల్‌లో శుక్రవారం ఎన్జీఓ సాలిడారిటి నెట్‌వర్క్ డీడీఎస్ ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలన, భ్రూణ హత్యల నివారణ, బాల్యవివాహాల నుంచి బాలికలను కాపాడటం తదితర అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ గురించి వివరించారు. అబ్బాయి, అమ్మాయి ఇద్దరూ సమానమే అని అన్నారు. పాఠశాల హెచ్‌ఎం సత్యబాబా మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలన్నారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని బాగా చదుకోవాలని చెప్పారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్ సెక్రటరీ టీజీవీ శ్రీదేవి, మహిళా ప్రొటెక్టర్ మౌనిక, ఏఎన్‌ఎం విజయ కుమారి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు బీజేపీ సన్నద్ధం

ప్రొద్దుటూరు క్రైం : రానున్న సార్వత్రిక ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సమాయత్తం అవుతున్నట్లు ఆ పార్టీ ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్రె శ్రీనివాసులు తెలిపారు. ఆ పార్టీ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం ప్రొద్దుటూరు రూరల్, రాజుపాళెం మండలాల నూతన కమిటీలను ప్రకటించారు. ప్రొద్దుటూరు రూరల్ మండల ప్రెసిడెంట్‌గా కొర్రపాటి కంబగిరి, వైస్ ప్రెసిడెంట్లుగా రామమనోహర్, సుబ్బరాయుడు, జి.వెంకటయ్యతోపాటు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అలాగే రాజుపాళెం మండల ప్రెసిడెంట్‌గా లక్ష్మీనరసింహుడు, వైస్ ప్రెసిడెంట్లుగా రాజేష్‌రెడ్డి, కమ్మ్యాసాగారి రసూల్, బి.రాజగోపాల్‌రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి



విద్యుత్ సిబ్బందికి భద్రతా పరికరాలను అందిస్తున్న ఎస్ఈ రమణ

మైదుకూరు : అధికారులు, సిబ్బంది నిరంతరం వినియోగదారులకు అందుబాటులో ఉండి విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ తెలిపారు. శుక్రవారం ఆయన మైదుకూరు విద్యుత్ డివిజన్ కార్యాలయంతో పాటు పలు చోట్ల అధికారుల పనితీరును పరిశీలించారు. స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో అసిస్టెంట్ ఇంజనీర్ రామభద్రయ్య, ఇన్‌స్పెక్టర్ ఓబుళరెడ్డి విధులను పరిశీలించారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించి, విద్యుత్ బిల్లుల వసూళ్లపై దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాన్ని తనిఖీ చేసి, విద్యుత్ వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం విద్యుత్ డివిజన్ కార్యాలయంలోని పరిపాలన విభాగంలో పలు ఫైళ్లను పరిశీలించారు. విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో సిబ్బంది, విద్యుత్ ప్రమాదాల నివారణకు వినియోగించే ఎర్త్ పైపు, సేఫ్టీ బెల్టు, టెస్టర్, స్క్రూడ్రైవర్, కటింగ్ ప్లేయర్, స్పానర్ల టూల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నూతన భవనాలలో విధులు ప్రారంభం

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని నూతన తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ భవనాలను ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ నూతన భవనాలలో శుక్రవారం తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి, పోలీస్‌స్టేషన్‌లో పులివెందుల రూరల్ సీఐ బాల మద్దిలేటి, ఎస్ఐ రోషన్, ఆయా అధికారులు నూతన భవనాలలో ప్రత్యేక పూజలు చేసి విధులు నిర్వహించారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సింహాద్రిపురం మండల అభివృద్ధిపై ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆసక్తిగా ఆడుదాం ఆంధ్రా క్రీడలు



నక్కలదిన్నెలో కబడ్డీ ఆడుతున్న యువకులు

చాపాడు : ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి స్వగ్రామమైన నక్కలదిన్నె గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఆసక్తిగా జరిగాయి. కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహించటం జరుగుతుందన్నారు. గ్రామ సచివాలయ పరిధిలో గెలుపొందిన వారికి మండల స్థాయిలో పోటీలు ఉంటాయని తెలిపారు.

ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించాలి



రాష్ట్ర అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మైనార్టీ సంక్షేమ శాఖ విభాగ సీఈడీఎం ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించాలని రూట వ్యవస్థాపకుడు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ కోరారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను కడపలోని తమ క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పరీక్షల సన్నద్ధం కోసం స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగ పడుతుందని, వీలైనంత త్వరగా అందించాలని కోరారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం సంబంధిత రాష్ట్ర అధికారులకు ఫోన్ చేసి స్టడీ మెటీరియల్ ఎందుకు సరఫరా చేయలేదని ప్రశ్నించారు. వారంలోపు పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూట రాష్ట్ర నాయకులు షాహిదుల్లా, మహమ్మద్ అయ్యూబ్, సయ్యద్ సిరాజుద్దీన్, ఆప్‌జల్ బాషా, పక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజం అభివృద్ధి

రిటైర్డు జిల్లా జడ్జి ఇస్మాయిల్



మాట్లాడుతున్న రిటైర్డు జిల్లా జడ్జి ఇస్మాయిల్

చాపాడు : విద్యా వ్యవస్థలు గొప్ప చదువులు అందించడం ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని రిటైర్డు జిల్లా జడ్జి ఇస్మాయిల్ పేర్కొన్నారు. మండలంలోని పల్లవోలు గ్రామం వద్ద ఉన్న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం రాత్రి స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డు జిల్లా జడ్జి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో జాతీయ స్థాయి విద్యను అందించే పాఠశాలను ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు మంచి చదువు అందించాలని, చదువు ద్వారానే గొప్ప స్థాయికి వెళతారన్నారు. కరస్పాండెంట్ జయచంద్రారెడ్డి మాట్లాడుతూ పెద్ద పెద్ద పట్టణాల్లో మాత్రమే జాతీయ స్థాయి పాఠశాలలు ఉన్నాయని, మన ప్రాంతంలో కూడా ఏర్పాటు చేయాలనే తలంపుతోనే ఐడీపీఎస్‌ను స్థాపించామన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. అనంతరం చదువులో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఐడీపీఎస్ ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్, సీబీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులరెడ్డి, ఐడీపీఎస్ డైరెక్టర్ రోహిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా కిట్లు అందజేత



క్రీడా కిట్లతో బి.మఠం మహాగురుకుల విద్యార్థులు

బ్రహ్మంగారిమఠం : విద్యార్థులు అడిగిందే తడవుగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తోట్లపల్లె దగ్గర ఉన్న మహాగురుకులం విద్యార్థుల కోసం క్రీడలకు చెందిన అన్నిరకాలు కిట్లను ఉచితంగా శుక్రవారం ఆయన వ్యక్తిగత కార్యదర్శి రాఘవరెడ్డి ద్వారా పంపిచారు. ఈనెల 26న తోట్లపల్లె దగ్గర రూ.21 కోట్లతో నూతనంగా నిర్మించిన మహాగురుకుల పాఠశాల భవనాల ప్రారంభానికి వచ్చిన ఎంపీ కొద్దిసేపు విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం వారికి అవసరాలను అడిగి తెలుసుకొన్నారు. క్రీడా కిట్లు కావాలని ఎంపీని కోరగా క్రీడలకు చెందిన అన్నిరకాల కిట్లను పంపించారు. ఈసందర్భం పాఠశాల ప్రిన్స్‌పాల్ మూర్తి మాట్లాడుతూ ఎంపీ సహృదయంతో ఎంతో విలువైన క్రీడలకు చెందిన కిట్లును ఉచితంగా పంపినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

పత్రికల పఠనం.. విజ్ఞానానికి దోహదం



తిరుగుబాటు మాసపత్రిక విడుదల చేస్తున్న విద్యాశాఖ అధికారులు

కడప ఎడ్యుకేషన్ : పత్రికల పఠనం విజ్ఞానానికి దోహద పడుతుందని ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, ప్రగతిశీల యువజన సంఘం సంయుక్తంగా ముద్రించిన తిరుగుబాటు మాసపత్రికను శుక్రవారం కడపలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎద్దుల రాఘవరెడ్డి, డిప్యూటీ డీఈఓలు రాజగోపాల్‌రెడ్డి, క్రిష్ణప్పలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ మాట్లాడుతూ పీడీఎస్‌యూ, పీవైఎల్ సంయుక్తంగా 1984 నుంచి ఈ పత్రికను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ పత్రికలో ప్రధానంగా వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, సామాజిక వేత్తలు, లౌకిక ప్రజాస్వామ్యవాదులు వారి ఆలోచనలతో వ్యాసాలు రాయడం జరిగిందన్నారు. విద్యార్థులు, యువతకు ఈ పత్రిక ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎంఈఓ పాలెం నారాయణ, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, జిల్లా కార్యదర్శి శ్రీనాథ్‌యాదవ్, నగర కార్యదర్శి గణేష్, వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు శంకర్‌రెడ్డి, రమణారెడ్డి, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులరెడ్డి, రమేష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని సమర్థించే బలిజ నాయకులు

వాస్తవాలు తెలుసుకోవాలి

వైఎస్సార్‌సీపీ బలిజ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీని సమర్థించే బలిజ నాయకులు వాస్తవాలు తెలుసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలిజ నాయకులు తోటక్రిష్ణ, ఎస్‌వీ రాము, పత్తి రాజేశ్వరి, సుదర్శన్ రాయల్ అన్నారు. శుక్రవారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బలిజలను ఒక కులానికి, ఒక పార్టీకి అంటగట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వాస్తవాలు మాట్లాడుతుంటే నాలుకలు కోస్తామని హెచ్చరించడం దారుణమన్నారు. టీడీపీలో ఎంతోమంది బలిజలను తొక్కేసిన చరిత్ర ఉందని, మాజీ మంత్రి బ్రహ్మయ్య దగ్గర నుంచి కడప టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన దుర్గాప్రసాద్ వరకు ప్రతి ఒక్కరూ అణచివేతకు గురయ్యారని గుర్తు చేశారు. చివరికి హరిప్రసాద్ సైతం టీడీపీ చేస్తున్న కుటిల రాజకీయాల్లో బలయ్యారనేది నిజమా, కాదా స్పష్టం చేయాలన్నారు. బలిజలకు సీటు తెచ్చుకోలేని టీడీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారంటూ మండిపడ్డారు. 2014లో టీడీపీ తరపున బలిజ నాయకుడు దుర్గాప్రసాద్ పోటీ చేస్తే హీనంగా ఓటమి పాలు చేశారన్నారు. ఇందులో హరిప్రసాద్ పాత్ర ఉందా లేదా అంటూ ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ తరఫున నిలబడే ఏ అభ్యర్థికైనా బలిజ కులస్తులు మద్దతుగా ఉండి గెలిపిస్తారని స్పష్టం చేశారు. బలిజలకు వైఎస్ఆర్‌సీపీ ఏం చేసిందో, టీడీపీ ఏం చేసిందో చర్చించేందుకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో కాకుండా ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చించేందుకు తాము సిద్ధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ నాయకులు శివకేశవ, వెంకట సుబ్బయ్య, రెడ్డి ప్రసాద్, వెంకటేష్, బండి బాబు, మల్లేశ్వరి, ఉమామహేశ్వరి, శంకరాపురం సింధు, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల తనిఖీ

పులివెందుల టౌన్ : పట్టణంలోని జగనన్న హౌసింగ్ కాలనీలో జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులతోపాటు పలు అభివృద్ధి పనులను శుక్రవారం మున్సిపల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనాథరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. వీలైనంత త్వరగా అన్ని అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

నూర్‌బాషా దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా రసూల్



పులివెందుల రూరల్ : నూర్‌బాషా దూదేకుల కార్పొ రేషన్ రాష్ట్ర చైర్మన్‌గా రసూల్‌ను నియమించారు. శుక్రవారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు రాష్ట్ర నూర్‌బాషా దూదేకుల కార్పొ రేషన్ చైర్మన్ పదవి ఇచ్చినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్రంలో నూర్‌బాషా దూదేకుల సంఘాన్ని బలోపేతం చేసే విధంగా తన వంతు సహాయ సహ కారాలు అందిస్తానన్నారు. అలాగే 2024 ఎన్నికలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అత్యధిక సీట్లు వచ్చే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నూర్‌బాషా దూదేకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

యూటీఎఫ్ సేవలు ప్రశంసనీయం



క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం, యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయం అని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం తన నివాసంలో యూటీఎఫ్ స్టిక్కర్, క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్యారంగ సంక్షేమం కోసం యూటీఎఫ్ కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, తేజేస్ ఆహ్మద్, నాయకులు మస్తాన్‌బాషా, జావీద్, బాబు, కరీముల్లా, మహబూబ్‌ఖాన్, జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురిపై బైండోవర్

జమ్మలమడుగు రూరల్ : మండలంలో శుక్రవారం ఐదుగురిపై బైండోవర్ కేసు నమోదు చేసి స్థానిక తహసీల్దార్ గురప్ప ఎదుట హాజరు పరచినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. గతంలో వీరిపై పలు కేసులు ఉండటం వల్ల వీరిపై బైండోవర్ కేసు నమోదు చేశామన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కాలనీ వాసులతో కలిసి మొక్కలు నాటుతున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజారావు పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా రెండవ రోజు సింగపూర్ టౌన్‌షిప్‌లో విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు వాతావరణ కాలుష్యంతో వర్షాలు సకాలంలో కురవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ టౌన్‌షిప్ ప్రెసిడెంట్ బండి రాఘవరెడ్డి, సెక్రటరీ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.